
# కారు మేఘాలు

**డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి**



శ్రావణ మేఘాలు హడావిడిగా పేరంటానికి వెళ్తున్నాయి. క్రొత్త చీరలు, ముంజేతికి తోరణాలు, పసుపు పూసిన పాదాలు, నుదుట పెద్ద కుంకుమ బొట్టు, చేతులలో వచ్చి శనగల పొట్లాలు. సన్నటి తుంపర చల్లగా స్పృశిస్తూంటే తనువులు పులకరించి హృదయాలు అనుభూతి అంచుల్ని తాకుతూ వుండగా కబుర్ల మువ్వలు మ్రోగించుకుంటూ అడుగు ముందుకు కదుపుతున్నారు పేరంటాళ్ళు.

వసుధ ఎలుగెత్తి ఏడుస్తున్న కొడుకుని సముదాయించడానికి నానాతంటాలు పడుతూంది. ప్రక్కవాటాలోని పేరంటాళ్ళ కోలాహలాన్ని నిర్లిప్తంగా గమనిస్తూందామె. ప్రక్కవాటా సుందరి వారం రోజులనుంచి వరలక్ష్మీవ్రతానికి సన్నాహాలు చేస్తూంది. అవతలివాటా మణిని తోడుతీసుకెళ్ళి కంచి పట్టుచీర కొనుక్కుని వచ్చింది. రెండు మూడు రోజుల్నుంచి తెలిసిన ముత్తయిదువులందర్నీ బొట్టు పెట్టి పేరంటానికి పిలిచివచ్చింది. ఉదయం వ్రతం చేసుకుని వసుధను, మణిని భోజనానికి పిలిచింది. సుందరి పెట్టిన భోజనం రెండుముద్దలు తినగానే ఆకలితో నకనకలాడుతున్న జాన్ గుర్తుకొచ్చి కడుపంతా తెమిలినట్లయి చెయ్యి కడిగేసుకుంది వసుధ. నాలుగురోజులుగా అర్ధాకలితో నెట్టుకొస్తున్న వసుధకు, జాన్‌కు నిన్నటి నుంచి అదీలేక "కడుపునిండా భోజనం" అనేది ఒక తియ్యటి అనుభవంగా అనిపించసాగింది.

పసిబిడ్డ ఆకలితో ఎండిన రొమ్ముల్ని పీకుతూ వుంటే ప్రాణం జివ్వుమంది వసుధకు. అప్పుకోసం వెళ్ళినజాన్ ఎంతో కొంత డబ్బు తెస్తాడు, ఒక గ్లాసుడు పాలైనా కాచి బిడ్డకు పట్టొచ్చని ఆశగా ఎదురు చూసిన వసుధ వట్టి చేతుల్తో తిరిగొచ్చిన భర్తను చూసి ఏడుపునాపుకోలేకపోయింది.

"వసూ! ప్లీజ్. ఏడవొద్దు, నువ్వు. నీ ఏడుపు చూస్తూంటే నాకు ధైర్యం కూడా కరిగిపోయి పాతాళంలోకి క్రుంగిపోతున్నట్లుగా వుంది." వంగి భార్య తల మీద చెయ్యేసి ఓదార్పుగా తడుతున్న జాన్ శక్తి సన్నగిల్లి నిస్సత్తువతో ఒరిగిపోతున్న సైనికుడిలా వున్నాడు.

"మన మెలాగైనా వుంటాం. బాబునేం చెయ్యను చెప్పు?" దీనంగా అడిగింది వసుధ. ఆమె కళ్ళముందు ఎమ్. ఏ. ఫస్ట్ క్లాస్ డిగ్రీలు తీసుకుని ఈ విశాల విశ్వం తమకోసమే సృష్టించబడింది. దీనికి అధినేతలు తామే నన్నంత ధీమాతో యూనివర్సిటీ బయటకు అడుగుపెట్టిన రోజు కదిలింది. తరువాత ఉద్యోగం సంపాదించడానికి పడిన పాట్లు, అవమానాలు, అగాధంగాలు గుర్తుకొచ్చాయి. జాన్‌కి ఈ ఊళ్ళో వున్న ప్రైవేట్ కాలేజిలో జూనియర్ లెక్చరర్ పోస్ట్ దొరికిన రోజున యెంతగా పొంగిపోయారు! "మనసులు కలిసిన స్త్రీ పురుషులు కలిసి బ్రతకడానికి, హాయిగా, సుఖంగా జీవించడానికి అంతులేని ఐశ్వర్యం వుండనక్కర్లేదు-కనీసఅవసరాలు తీరితేచాలు. అనురాగం, ఆప్యాయత సంపదల్ని కట్టి వుంచాలికానికులం, మతం, ఆస్థి, అంతస్తు కాదు" అంటూ తనవారందర్నీ ధిక్కరించి జాన్‌తో తన బ్రతుకుని ముడేసుకుని ఈ ఊరికి తరలి వచ్చిన రోజు జ్ఞాపకం వచ్చింది.

కాపురం పెట్టిన కొద్ది నెలలకే యెదురయిన అనుభవాలు చూసి తబ్బిబ్బుపడిపోయారు భార్యాభర్తలిద్దరూ. సంతకం చేయించుకునే అంకె వేరు, చేతికందే జీతం వేరు. ఆ అందేదికూడా నెలల తరబడి చేతికందకపోవడంతో ఎలా బ్రతకాలో తెలియక బెంబేలుపడిపోసాగారు. అప్పు చెయ్యడమనే ఆర్ట్ బొత్తిగా తెలియకపోవడంవల్ల, తమ పరిస్థితుల్ని యితరులకు తెలియనివ్వడం నామోషీగా భావించడంవల్ల వస్తులుండడమనే ఆర్ట్‌ని ప్రాక్టీస్ చెయ్యక తప్పింది కాదు.

చేసిన ఉద్యోగ ప్రయత్నాలు ఫలించక విసిగి వూరుకున్న వసుధ ఈ విషమ పరిస్థితిలో ఎంతోకొంత తను కూడా సంపాదిస్తే తప్ప బ్రతుకు గడవదని తెలిసొచ్చి మళ్ళీ ఉద్యోగపు వేటలో పడింది. ఒక కాన్వెంట్ స్కూల్లో టీచర్‌గా టెంపరరీ పోస్ట్ ఒకటి ఖాళీగా వుందని తెలిసి అప్లై చేసింది. అయితే ఆ జాబ్‌ని ఎలా పొందాలో వివరాలు తెలుసుకొచ్చిన మిత్రుడు చెప్పేసరికి నిర్ఘాంతపోయారు. ఆ జాబ్ వెల కేవలం రెండువేల రూపాయలేనని. సకాలంలో మేల్కొని ఆ ధర చెల్లించకపోతే యింకో వెయ్యి ఎక్కువగా కట్టి అయినాసరే జాబ్ సంపాదించడానికి లెక్కలేనంతమంది కాచుక్కూర్చున్నారని చెప్పి

పేషంట్ చెప్పే కథలు

# మాబడి

ఏడవ తరగతి విద్యార్థుల కోసం నెలనెలా వెలువడే పత్రిక

వెల 2 రూ॥

సం॥ చందా 18 రూ॥లు

చందాపంపాల్సిన అడ్రసు: చౌడేపల్లి PIN 517 257 చి.జి.





అపోసపో చేసయినా సరే జాబ్ దక్కించుకోమని ఉద్బోధించాడామిత్రుడు. "లంచమిచ్చి జాబ్ సంపాదించడమా? యింత ఆత్మ న్యూనతతో కూడిన వ్యవహారానికెలా పాల్పడడం!" అని గుంజాటన పడ్డారు. పస్తులతో పడుకోనైనా పడుకుంటాంగాని యింత సిగ్గుచేటైన పనికి తలపడలేమన్నారు. వారి అమాయకత్వానికి జాలిపడ్డమిత్రుడు, ప్రస్తుత వ్యవస్థలో ప్రతి చిన్నదీ ఎలా అమ్మకపు వస్తువుగా మారిందో, మనకు కావలసినదాన్ని తలతాకట్టు పెట్టయినాసరే ఎలా కొనుక్కోవాలో, అలా కొనుక్కోకపోతే ఎలా బ్రతకలేమో జ్ఞానబోధచేసి ఎట్టకేలకు అంగీకరింపజేశాడు. వసుధ తన మెడలో వున్న ఒంటిపేట గొలుసును అమ్మి జాబ్‌ని కొనుక్కుంది.

వసుధ మొదటి జీతం తీసుకునేనాటికి జాన్‌కి మూడు నెలల జీతం ఒక్కసారి చేతికి వచ్చింది. జారిపోతున్న ఆత్మవిశ్వాసాన్ని కూడదీసుకుని ఉత్సాహంతో తమ ఉద్యోగ విధులను నిర్వహించసాగారు భార్యాభర్తలిద్దరూ, వసుధ కడుపులో ఊపిరి పోసుకుంటున్న పాపాయిని సంతోషంగా, గర్వంగా ఆహ్వానించారు.

"డెలివరీ గురించి నువ్వేం దిగులు పెట్టుకోకు. హాస్పిటల్లో వున్నంత కాలం నీకేలోటూ లేకుండా, ఏ కష్టం లేకుండా చూసుకునే భారం నాది"—డెలివరీ గురించి భయపడుతున్న వసుధను ఊరడించింది శ్రుతి. అనుక్షణం అమ్మను తలచుకుని కలత చెందుతున్న వసుధ శ్రుతిని చూసి ధైర్యం తెచ్చుకుంది.

కబురు తెలిసి చూడడానికి వచ్చిన వసుధ ఫ్రెండ్ మాలతి తల్లీబిడ్డల్ని తనతో తీసుకువెళ్ళి రెండు నెలలుంచుకుని పంపింది. ఇంటి దగ్గర బిడ్డను చూసుకోవడానికి మనిషిని ఏర్పాటు చేసుకుని డ్యూటీలో చేరడానికి వెళ్ళిన వసుధ తన స్థానంలో మరొకర్ని అపాయింట్ చేసి తనకు మొండిచెయ్యి చూపించడంతో నిశ్చేష్ట అయింది. విపరీతమైన ఆవేశంతో దెబ్బలాడింది. తను చెల్లించిన డబ్బు మాటేమని క్రోధంగా నిలదీసింది. చివరకు తన ఆవేశం, కోపం, కేకలు నిష్ప్రయోజనమని తేలిపోయాక పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది.

పులిమీద పుట్రలా అప్పుడే రెండు నెలల నుంచి జాన్‌కి జీతం రావడంలేదు. కూడబెట్టిన డబ్బంతా వసుధ డెలివరీ టైములో అయిపోయింది. క్రమేపీ అవసరం అప్పులు చెయ్యడంకూడా నేర్పింది. దొరికిన చోటల్లా అప్పులు చేశారు. ఇప్పుడదీ పుట్టని పరిస్థితి వచ్చింది.

వసుధ కళ్ళు తుడుచుకుంది. మనసంతా తిక్కతిక్కగా వుంది. గోడకు వ్రేలాడుతున్న డిగ్రీల్ని చూస్తే కసిగా వుంది. హైస్కూలు చదువుకూడా దాటకుండా పై సంపాదన పుష్కలంగా వుండే చిరుద్యోగం చేస్తున్న ప్రక్కవాటా ఆంజనేయులి భార్య సుందరి చేస్తున్న పేరంటపు కోలాహలం విపరీతమైన ఆవేశాన్ని రగిలిస్తూంది.

"వసూ! బాబలా గుక్కపట్టేడుస్తున్నాడు, కడుపు నొప్పిగా వుందేమో! డాక్టర్‌గారికి చూపించి రారామా?" జాన్ మాటలు విని వసుధ మౌనంగా బాబుని భుజానేసుకుంది.

"బాబుకు పాలు పట్టి ఎంత సేపయిందమ్మా?" బాబుని పరీక్షచేసి వసుధని అడిగింది శ్రుతి.

"ఇంతకుముందే-" వినీవినపడనట్లుగా జవాబిచ్చింది వసుధ.

"బహుశా ఆకలి తీరుండదు. పాలు పట్టు మళ్ళీ. అప్పటికీ ఏడుపు మానకపోతే ఈ మందు పట్టు." వసుధ క్రుంగిపోతూంది. ఆమెకు తెలుసు బాబుకు ఆకలి నొప్పే కాని కడుపు నొప్పి కాదని.

"నువ్వేమిటలా వున్నావు వసుధా?" వసుధ భుజంమీద చెయ్యేసి మృదువుగా అడిగింది శ్రుతి. మేఘాలు చిట్లాయి. వర్షంలో తడిసి ఒణుకుతున్న పూలరేకుల్లా వున్నాయి వసుధ కనురెప్పలు.

"సారీ! కదిలించి నిన్ను బాధపెట్టానేమో." అంది శ్రుతి.

"అబ్బే! బాధేంలేదు మేడమ్! అలవాటయిపోయింది. బాధలకు చలించే సౌకుమార్యం కూడా హరించిపోతూంది. వెయ్యేళ్ళు తపస్సు చేసినా పొందలేని మనోనిబ్బరాన్ని నేర్పుతోంది నిరుద్యోగ పర్వం. సాధన పూర్తికాక అప్పుడప్పుడీ తడబాటు." కన్నీళ్ళతో నవ్వింది వసుధ. కోల్పోతున్న ఆత్మస్థైర్యాన్ని బలవంతాన కూడదీసుకుని శ్రుతి దగ్గర సెలవు తీసుకుంది.

మేఘాలు ముసురుకోవడం వల్ల బయట చిమ్మచీకటిగా వుంది. ఒక క్షణం భయమేసినా, నడుస్తూవుంటే అంతలోనే మబ్బుల్ని చీల్చుకుని వెన్నెల రేకలు వికసిస్తాయేమోనని ఆశపడుతూ అడుగు ముందుకు కదిపింది వసుధ. ●